ప్రజాశక్తి

శుక్రవారం 19 డిసెంబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఆంక్షలతో కష్టం.. బస్తాకు రూ.500 నష్టం

- తక్కువ ధరకే కొంటున్న వ్యాపారులు
- తప్పనిసరై అయినకాడికి అమ్ముకుంటున్న రైతులు
- తెలంగాణకు తరలుతున్న ధాన్యం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి ధాన్యాన్ని తెలంగాణ వ్యాపారులు జోరుగా కొనుగోలు చేస్తున్నారు. గుంటూరు పరిసర ప్రాంతాల్లో 75 కిలోల బస్తా రూ.1400కు కొంటున్నారు. పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల, నరసరావుపేట ప్రాంతాల్లో బస్తా రూ.1450 నుంచి రూ.1500కు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన ధర 75 కిలోల బస్తా రూ.1792 ధర రైతులకు దక్కడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం 17 శాతం మించి కొనుగోలు కేంద్రాల్లో తిప్పిపంపుతున్నారు. 20 శాతం వరకు తేమ ఉంటే బస్తాకు ఐదారు కిలోలు తరగు వేస్తున్నారు. దీంతో విసిగిన రైతులు ఎక్కువగా బయట వ్యాపారులకే అమ్ముకుంటున్నారు.

ప్రభుత్వం కూడా సేకరణ లక్ష్యం బాగా తగ్గించింది. గుంటూరు జిల్లాలో తొలి విడత కేవలం 30 వేల మెట్రిక్ టన్నులను సేకరించాలని జిల్లా అధికారులకు లక్ష్యంగా నిర్ధేశించారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 162 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దాదాపు 3.60 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. మొత్తం 50 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం అధికారులకు లక్ష్యం విధించింది. జిల్లాలో 209 రైతు సేవకేంద్రాల పరిధిలో 47 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు 30 వేల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాళ్ రూ.2389గా మద్దతు ధర ప్రకటించింది. దీని ప్రకారం 75 కిలోల బస్తా రూ.1792కు కొనుగోలు చేయాలి. సాధారణ రకం ధాన్యానికి రూ.2369గా ప్రకటించారు. దీని ▶ 2లో



ఇన్సూరెన్స్ చట్ట సవరణపై నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

సబ్కా బీమా సబ్కీ రక్ష - 2025 (ఇన్సూరెన్స్ చట్టాల సవరణ) పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా బిల్లును పార్లమెంటు ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ బీమా, బ్యాంకింగ్ అధికారులు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గురువారం అరండల్‌పేటలోని ఎల్‌ఐసి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ పూర్వ కార్యదర్శి వివికె.సురేష్ మాట్లాడుతూ బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 74 నుండి 100 శాతానికి పెంచటం దేశ ఆర్థిక ప్రయోజనాలకు హానికరమని, ఈ నిర్ణయం దేశప్రజల విలువైన పొదుపు మొత్తాలను విదేశీ కంపెనీల శక్తుల చేతుల్లో పెట్టడమేనని అన్నారు. ఇప్పటికే ఉన్న 74 శాతం పరిమితిని కూడా బీమా కంపెనీలు పూర్తిగా వినియోగించుకోలేదని, ప్రస్తుతం సగటున 32.67 శాతం వరకే విదేశీ పెట్టుబడులు వచ్చాయని, కాబట్టి 100 శాతం వరకు అనుమతి ఇవ్వాల్సిన అవసరం లేదని వివరించారు. మన దేశ ప్రజల పొదుపుపై విదేశీ కంపెనీల పెత్తనం వల్ల మన దేశ ఆర్థిక స్వావలంబన ప్రమాదంలో పడుతుందన్నారు. బ్యాంకింగ్ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు పి.కిశోర్‌కుమార్, కె.కోటిరెడ్డి, పి.కళ్యాణ్ మాట్లాడుతూ జాతీయకరణ నాటి నుండి దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకులను, ఎల్‌ఐసిని బలహీన పరిచే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోందని, ఈ విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సయ్యద్ బాషా, ఎమ్.సాంబశివరావు, ఆర్‌విఎస్.శ్రీనివాస్, రాంబాబు, ఎం.నాగపావని, పి.హనుమంతరావు, సి.హెచ్.మధుబాల, సిఐటియు నాయకులు టివిజి.రవిశంకర్, డి.సైదులు, వి.ఆర్.గోపాలకృష్ణ, జె.ప్రశాంత్ కుమార్, ఎం.రాజేశ్వరరావు పాల్గొన్నారు.



తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామంలో ప్రతుల దహనం

5లో

ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చొద్దు : రైతు సంఘం

బిల్లు ప్రతులు దహనం చేసి నిరసన

మరో కౌలురైతు ఆత్మహత్య

వార్త మెయిన్‌లో

ఉపాధ్యాయులకు టెట్‌ను మినహాయించాలి

గుంటూరు, నరసరావుపేటలో యుటిఎఫ్ ధర్నాలు

ప్రజాశక్తి-గుంటూరు

ఎంతో కష్టపడి నాడు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరీక్షలన్నీ ఉత్తీర్ణులై ఉపాధ్యాయులుగా చేరినవారికి మళ్లీ టెట్ నిర్వహించడం హాస్యాస్పదంగా, ఇన్‌సర్వీసు టీచర్లకు టెట్ మినహాయించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ అంశమై గుంటూరు కలెక్టరేట్, పల్నాడు జిల్లా డిఇఒ కార్యాలయాల ఎదుట గురువారం ధర్నాలు చేసి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. గుంటూరు ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శి యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, నరసరావుపేట ధర్నాలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ ఖాసీంపీరా, సహాధ్యక్షులు జెవిడి వాల్యా నాయక్, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.సుందరరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి.ప్రేమ్ కుమార్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. అవసరమైన మేరకు విద్యాహక్కు చట్టంలో అర్హతల నిబంధనలను సెక్షన్ 23 (2) సవరణ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక పేరుతో ఒత్తిడి తగ్గించాలని కోరారు. ▶ 2లో



నరసరావుపేటలో డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

ఎఐకెఎస్ కౌన్సిల్ సమావేశాలకు ఆహ్వాన సంఘం ఏర్పాటు

అధ్యక్షులుగా కెఎస్‌లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అఖిలభారత కిసాన్ సభ జాతీయ సమావేశాలు జనవరి 28,30,31, ఫిబ్రవరి 1తేదీ వరకు గుంటూరులో జరగనున్నాయి. ఈ సమావేశాల నిర్వహణకు ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, గౌరవాధ్యక్షులుగా ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం మాజీ డీన్ ప్రొఫెసర్ రావూరి వీరరాఘ వయ్య, రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శిగా కంచుమాటి అజయ్‌కుమార్, కోశాధికారిగా జొన్నా శివశంకర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కార్యదర్శి కె. ప్రభాకరరెడ్డి, నాయకులు పాశం రామారావు, కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు వై.రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి ఎం.హరిబాబు, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, సలహాదారులుగా ఎన్‌జి రంగా యూనివర్సిటీ సీడ్స్ డైరెక్టర్ పి.సుబ్బరామిరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఫార్మర్ సెంటర్ జి.ఎం.వి.ప్రసాదరావు, రాగులకొల్లు అంకయ్య, డాక్టర్ నరసింహారావు, ఎం.వి.రమణ, కె.విజయలక్ష్మీ, డాక్టర్ హరిబండ ప్రసాదరావు, కల్లూరి మురళీధరరావు, బండ్ల సూరయ్య చౌదరి, బీరం నాగేశ్వరరావు, నర్రా శ్రీనివాసరావు, ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రమణ్యం, వి.లక్ష్మణరెడ్డి, ఈమని అప్పారావు, ముత్తవరపు సురేష్, వల్లూరి భారతి, వి.వి.కె.సురేష్, ఏపూరి గోపాలరావు, టి.రత్నారావు, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, చెన్నంశెట్టి కుమార్, చిష్టి ఎన్నికైనట్లు కె.అజయ్‌కుమార్ తెలిపారు.


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

పురిటి బిడ్డను చూడ్డానికి వెళ్తూ మృత్యువాత

ప్రజాశక్తి - నాదెండ్ల

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సాతూలూరులోని పెట్రోల్ బంక్ సమీపంలో గుంటూరు–కర్నూలు రహదారిపై గురవారం రాత్రి జరిగింది. ఎస్ఐ.వెంకటేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ దాసరి బాలాజీ (28) మేనమామ భార్య నరసరావుపేలోని ఆస్పత్రిలో ప్రసవించడంతో ఆమెను చూసేందుకని బాలాజి గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. సాతులూరులోని పెట్రోల్ బంకు వద్దకు రాగానే నరసరావుపేట వైపు నుండి గుంటూరు వైపు వెళ్తున్న రైల్వే శాఖకు చెందిన లారీ ఎదురుగా వచ్చి ఢీకొనడతో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ వెంటనే పరారవగా, సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు. కుటుంబంలో ఒక్కగానొక్క కుమారుడుని మృతితో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఆంక్షలతో కష్టం.. బస్తాకు రూ.500 నష్టం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం 75 కిలోల బస్తా రూ.1776కి కొనుగోలు చేయాల్సి ఉంది. జిల్లాలో 90 శాతం 'ఎ' గ్రేడు ధాన్యం ఉత్పత్తి చేశారు. దీని ప్రకారం బస్తా రూ.1792 కొనుగోలు చేయాల్సి ఉండగా వ్యాపారులు రూ.1300 నుంచి రూ.1350కి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణ వ్యాపారుల మాత్రం మెట్ట ప్రాంతంలో పండిన ధాన్యానికి రూ.1400కి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మొత్తంగా ఒక్క రైతు బస్తాకు రూ.400 నుంచి రూ.500 వరకు నష్టపోతున్నారు. ఎకరాకు బస్తాలు ఉత్పత్తి కాగా గరిష్టంగా రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకు రైతులు నష్టపోతున్నారు. మొత్తం ఉత్పత్తిలో ప్రభుత్వం కేవలం 15 నుంచి 20 శాతం ఉత్పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మిగతా ధాన్యం అంతా ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. పల్నాడు జిల్లాలో లక్ష ఎకరాల్లో వరి సాగు చేశారు. 3 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉండగా 30 వేల టన్నుల సేకరణే లక్ష్యం నిర్ధేశించారు. ఇప్పటి వరకు 3 వేల టన్నులే కొనుగోలు చేశారు.



ఇళ్ల కోసం 28లోపు దరఖాస్తుల చేసుకోవాలి

ప్రజాశక్తి–ఫిరంగిపురం

మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి షేక్ షహేలా నర్గీస్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పలు అంశాలను ప్రస్తావించగా వాటి పరిష్కారానికి ఎంపిపి, మండల స్థాయి అధికారులు హామీనిచ్చారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్య అంశాలపై చర్చించారు. సొంతిళ్లు లేని పేదల ఇంటి నిర్మాణం కోసం ఈనెల 28వ తేదీలోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిడిఒ పి.శివశుబ్రహ్మణ్యం, తహశీల్ధార్ జె.ప్రసాద్‌రావు, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ తడవర్తి కేశవరావు, వైఎస్ ఎంపిపి అనురాధ, ఎంఇఒ షేక్ మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టెట్‌ను మినహాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ సెలవుదినాలు, పండగరోజులలో తరగతులు రద్దు చేయాలన్నారు. కనీస పనిదినాలు సరిపోతున్నా విద్యాశాఖ అధికారులు సెలవు దినాలలో కూడా పాఠశాలలు నిర్వహించడం, అశాస్త్రియమైన, ఆచరణ సాధ్యంకాని కార్యాచరణలతో విద్యార్థులు, ఉపాధ్యాయులపైన వత్తిడి పెంచడం సరికాదని అన్నారు. సిలబస్ సమయం సగానికి సగం తగ్గించి జిఎఫ్ఎల్ఎన్ పేరుతో కొత్త కార్యాచరణ ప్రవేశపెట్టి ఏక కాలంలో రెండూ పూర్తి కావాలని ఆదేశాలివ్వటం ప్రతికూల ఫలితాలు ఇస్తుందని చెప్పారు. పర్యవేక్షణ పేరుతో ఇతర శాఖల అధికారులు పాఠశాలలకు వచ్చి తనిఖీ చేయటం, అజమాయిషీ చేయడం వంటి కార్యక్రమాలకు స్వస్తి పలకాలన్నారు. అనంతరం గుంటూరులో జాయింట్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాత్సవ్‌కు, డిఇఒ సలీంబాషాకు, నరసరావుపేటలో డిఇఒ కార్యాలయం ఏడీ వెంకట రమణకు, కలెక్టరేట్‌లో డిఆర్‌ఒకు వినతిపత్రాలిచ్చారు. టెట్ నుంచి సీనియర్ ఉపాధ్యాయులను మినహాయించాలని, టెట్‌కు హాజరవుతున్న ఉపాధ్యాయులందరికీ ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని, జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, సింగిల్ టీచర్స్ స్కూల్లో పనిచేసే ఉపాధ్యాయులకు సెలవు మంజూరులో కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని, తదితర అంశాలను వినతిపత్రాల్లో పేర్కొన్నారు. గుంటూరులో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఎమ్‌డి.షకీలాబేగం, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎం.గోవిందయ్య, ఎ.శ్రీనివాసరావు, కె.రంగారావు, ఎం.కోటిరెడ్డి, బి.ప్రసాద్, నరసరావుపేటలో పల్నాడు జిల్లా కార్యదర్శులు టి.వెంకటేశ్వర్లు, ఉషాశౌరిరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గుంటూరు ధర్నాలో మాట్లాడుతున్న హనుమంతరావు

నేరాలను నియంత్రించాలి

కలెక్టర్లు, ఎస్‌పిలకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో గురువారం సాయంత్రం జరిగిన కలెక్టర్ల ముగింపు సదస్సులో జిల్లాల ఎస్‌పిలతో కలిపి శాంతి భద్రతల సమస్యలపై సిఎం సమీక్ష చేశారు. గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్‌పి వకుల్ జిందాల్, పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్‌పి కృష్ణారావు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లాలో నేరాల పెరుగుదల ఎక్కువగా ఉందన్నారు. నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేరం చేసిన వారు ఎంతటి వారు అయినా ఉపేక్షించవద్దని కోరారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంతో పాటు, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.సుపరిపాలన అందించడంలో జిల్లా యంత్రాంగం మరియు పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివద్ధి పనుల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రాష్ట్రంలో కార్పోరేషన్ల కేటగిరిలో 11,348 ఈ–ఆఫీస్ ఫైల్స్ ని అతి తక్కువ సమయంలో, అధిక సంఖ్యలో పరిష్కరించి, మొదటి స్థానాన్ని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు దక్కించుకున్నారని గురువారం పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ కుమార్ ఈ–ఆఫీస్ ఫైల్స్ పరిష్కారంపై రాష్ట్ర స్థాయిలో కమిషనర్ల ర్యాంక్ల నివేదికని ప్రకటించారు.


సదస్సులో గుంటూరు, పల్నాడు ఎస్పీలు, కలెక్టర్లు

నైతిక విలువలను అలవరచుకోండి



ప్రజాశక్తి - బొల్లాపల్లి (వినుకొండ)

ప్రతి విద్యార్థి నైతిక విలువలు అలవర్చుకొని దేశభక్తితో ముందుకు నడవాలని ప్రభుత్వ చీఫ్ విప్ సీనియర్ శాసన సభ్యులు జీవి ఆంజనేయులు కోరారు. శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినుకొండలోని లయోలా స్కూల్ ఆవరణలో జరిగిన రైజ్ ఇండియా విజన్ 2047 కార్యక్రమా నికి చీఫ్‌విప్ జీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యా ర్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశం కోసం పోరా డిన అల్లూరి సీతారామరాజు, ప్రకాశం పంతులు లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు దేశభక్తి తో విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించి విక సిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ 2047 దేశాభివృద్ధిలో భాగ స్వామ్యం కావాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు నీతి, నిజాయితీ, దయ, ధర్మం, బాధ్యత, గౌర వం వంటి విలువలను అలవర్చుకొని ముందుకు సాగే వారే జీవితంలో రియల్ హీరోలని వివరించారు. నైతిక విలువల తో విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించి ప్రతి ఒక్కరూ భావి భారత పౌరులుగా ఎదగాలని ఆయనఆకాంక్షించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - అచ్చంపేట

ఆరుకాలం పండించిన వరి పంటను గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు గురువారం అచ్చంపేటలోని రైతు భరోసా కేంద్రం1లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు వారి పంటలను స్వఛ్ఛేదంగా రైతు భరోసా కేంద్రాల వద్ద తీసుకొని వచ్చి అమ్ముకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సిబ్బందిపై సస్పెన్షన్ తొలగింపు

ప్రజాశక్తి–గుంటూరు

గణపవరం పిహెచ్‌సి సిబ్బందిపై కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సస్పెన్షన్‌ను తొలగించారని ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీని వాసరావు, ఏ. శ్యాంసుందర్ శ్రీనివాస్ ఒక సంయుక్త ప్రక టనలో తెలిపారు. ఇటీవల గణపవరం పీహెచ్సీని కమి షనర్ సాయంత్రం 5.30 గంటల తరువాత ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంలో సిబ్బంది అందుబాటులో లేరనే కారణంగా 12మంది ఉద్యోగులను సస్పెండ్ చేశారని, దీని పై ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్ కమిష నర్‌తో చర్చలు జరపగా, వారిపై కమిషనర్ విధించిన సస్పె న్షన్‌ను ఎత్తివేశారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యకులు, ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా కోర్టు ఆవరణలో చెత్త, వ్యర్థాలు తొలగింపు

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా



స్వచ్ఛభారత్–స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా నరస రావుపేట జిల్లా కోర్టు ఆవరణలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అరవిందబాబు పారి శుధ్య కార్మికులతో కలిసి జెసిబి యంత్రాలతో కోర్టు ఆవరణ లోని చెత్త, రాళ్లను ఎత్తివేసి, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు. వివిధ పనులపై కోర్టుకు వచ్చే ప్రజలకు ప్రాంగణం ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయాలని బార్‌అసోసియేషన్ సభ్యులకు సూచించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యుత్ లైన్‌మెన్ మృతి



ప్రజాశక్తి- తాడేపల్లి

పట్టణంలో విద్యుత్ లైన్‌మాన్‌గా నాలుగేళ్ల నుండి పని చేస్తున్న సురేంద్ర (53) గురువారం తెల్లవారు గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గతంలో అమరావతిలోని దొండపాడులో పని చేశారు. ఆయనకు తోటి ఉద్యోగులు, సిబ్బంది, అధికారులు నివాళులర్పించారు.

పల్స్‌పోలియోపై సమన్వయ సమావేశం

ప్రజాశక్తి - నాదెండ్ల

ఈనెల 21న జరిగే పల్స్ పోలియో విజయవంతం కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులు సమావేశం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్ధార్ వై.వి.బి. కుటుంబరావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి జ్ఞానేశ్వరి, అంగన్వాడీ సూపర్‌వైజర్ నిర్మల కృష్ణ పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

ప్రజాశక్తి - కాకుమాను (ప్రత్తిపాడు)



మృతి చెందిన కల్పన

కుటుంబ కలహాలతో వివాహిత మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండలంలోని యనమదల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎన్.నరహరి తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం చెంగిజ్ ఖాన్ పేటకు చెందిన కల్పన ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన సాంబశివ రావుతో 2023లో వివాహమైంది. కుమారుడు ఉన్నాడు. ఈ నెల 15న తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా తనకు, తన భర్తకు, అత్త మామకు గొడవ జరగడంతో కల్పన మనస్తాపం చెంది 17వ తేదీన ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఇంట్లోఉన్న గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే గుంటూరులోని ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 18వ తేదీ ఉదయం ఐదు గంటలకు మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

1170 లీటర్ల ఆయిల్ స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అక్రమంగా విక్రయిస్తున్న 1170 లీటర్ల ఆయిల్ ను అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఏటుకూరు బైపాస్ రోడ్ వద్ద ఉన్న లారీ పార్కింగ్‌లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయీస్, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు చేశారు. లైసెన్స్, బిల్లులు లేకుండా వైట్ ఆయిల్ (బయో డీజిల్)ను వివిధ వాహనాలకు విక్రయిస్తున్న ఇద్దపట్టుకుని వారి వద్ద రూ.93,600 విలువ కలిగిన ఆరు డ్రమ్ముల్లోని 1170 లీటర్ల ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్సు సిఐ కె.చంద్రశేఖర్, తహశీల్దార్ లక్ష్మీ మాధవి, ఎస్సై అమీర్, సిఎస్‌డిటి దుర్గారావు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సునీల్ పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ కె.శివలీల అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 21వ తేదీ జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి వ్యాక్సినేటర్లకు శిక్షణా కార్య క్రమం గురువారం నిర్వహించారు. డాక్టర్ గౌతమి మాట్లా డుతూ సత్తెనపల్లి రూరల్ మండలంలో 35 పల్స్‌పోలియో బూత్‌లు, మూడు రూట్‌ల ద్వారా అర్హులైన 6896 మంది చిన్నారులకు 100శాతం పోలియో చుక్కలు వేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నామన్నారు. వ్యాక్సిన్, ఐఈసి మెటీరియల్, ఇతర సామాగ్రి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రతి గృహాన్ని సందర్శించి చిన్నారులకు వ్యాక్సిన్ వేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆసుపత్రిలో సెమీక్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కార్య క్రమంలో డాక్టర్, యు.ఎస్.ఎల్ కవిత, సాయి తేజ రెడ్డి, సిహెచ్ఒ ఆమీనాక్షమ్మ, ఆరోగ్య విస్తరణాధికారి పి. శ్రీనివాస రావు ,ఆశీర్వాదమ్మ , రహమాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శివలీల

బంగారు పతకాలు సాధించిన ఎస్ఎస్ఎన్ విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ 48వ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు 2025లో స్థానిక శ్రీ సుబ్బ రాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థులు రెండు బంగారు పతకాలు, రెండు రజిత పతకాలు, నాలుగు కాంస్య పతకా లను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్. సుధీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10-12 వరకు ఖాజీ పాలెం కెవిఆర్, ఎంకెఆర్ కళాశాలలో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీల లో తమ కళాశాలకు చెందిన కె.ప్రసన్నకుమార్100 మీటర్ల స్ప్రింట్ (10.70 సెకండ్స్) తో బంగారు పతకాన్ని, 110 మీటర్లు హర్డెల్స్ 14.90 సెకండ్స్‌తో రజితం, 4x100 మీటర్లు రిలేపరుగు లో కాంస్య పతకం సాధించాడన్నారు. సి.హెచ్. వి.ఎం. గురు శంకర్ 800 మీటర్లు పరుగు పందెం (2.02) సెకండ్స్ తో బంగారు పతకం, 200 మీటర్లు పరుగు పందెం 23.19 సెకండ్స్‌తో రజితం, 4x100 మీటర్లు రిలేపరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించారు. ఎంవి. రవితేజ 4ఐ100 మీటర్లు రిలే పరుగు పందెంలో కాంశ్య పతకాన్ని, పి.వంశీ 4x100 మీటర్లు రిలే పరుగులో కాంస్యపతకాన్ని గెలుపొందాలని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్-మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, జాయింట్ సెక్రెటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ యక్కల మధు సూదనరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విజేతలకు అభినందనలు తెలిపారు.

చలి కోట్లు పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

సత్తెనపల్లి పట్టణం బిసి సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు గురువారం చలి కోట్లు పంపిణీ చేసినట్లు హెల్ప్ పౌండేషన్ అధ్యక్షులు కె.బుల్లిబాబు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర విస్తరణ అధికారి దుర్గ విచ్చేసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, మంచి ఆహారపు అలవాట్ల ను కలిగి ఉండి భవిష్యత్తును తీర్చిదిద్దు కోవాలని అన్నారు. పేదవాడు గొప్పవాడుగా మార్చే శక్తి చదువుకి మాత్రమే ఉందని తెలిపారు. సత్తనపల్లి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అంకాళ్ళ ప్రభుదాసు మాట్లాడుతూ ఉన్నత స్థితిని చేరుకున్న మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్య క్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కె. బుల్లి బాబు, హాస్టల్ అధికారిని ఇందిరాగాంధీ, గాయత్రి హెల్ప్ ఫౌండే షన్ సభ్యులు శ్రీలత, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చలి కోట్లు పంపిణీ చేసిన ఫౌండేషన్ సభ్యులు

మత్తులో డ్రైవింగ్ చేసిన వారికి జైలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి లక్షా 24 వేల జరిమానా, 05 మందికి ఒక వారం జైలు శిక్ష విధించినట్టు పోలీసులు తెలిపారు. బహిరంగ మద్యపానం, మద్యం తాగి వాహనాలు నడుపు తున్న వారిపై పోలీస్ అధికారులు చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుంటూరు నగరంలో ట్రాఫిక్ డిఎస్‌పి బెల్లం శ్రీనివాస రావు ఆధ్వర్యంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ బందం నగరంలో విస్తృత డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న మొత్తం 25 మందిని కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు. 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ కేసులను విచారించి నిందితులపై నేరం ఋజువు కావడంతో నిందితుల్లో 20 మందికి మొత్తం రూ.1,24,000 జరిమానా విధించారు. ఐదుగురికి వారం పాటు జైలు శిక్ష విధించారు.

తల్లిదండ్రులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - దుర్గి

మాచర్ల శ్రీచైతన్య పాఠశాలలో గురువారం ఘనంగా హ్యాపి క్లబ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 6 నుండి 9 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, వారితో ఆటలు ఆడించి, పాటలు పాడించారు. పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ అయ్యప రెడ్డి, హరణి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీన్ అనీల్, సి.ఇన్చార్జి శివ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం కుట్రలపై నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతిపిత మహాత్మా గాంధీ పేరుతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీచట్టం-(ఎంజిఎన్ఆర్ఇజిఎస్ -2005) స్థానంలో వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీతిక్ మిషన్ గ్రామీణ్ (విబి-జి రాంజీ 2025)గా మార్చుడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నాయకులు అన్నారు. పేరు మార్చుడానికి వ్యతిరేకంగా చేపట్టే నిరసన కార్యక్రమాలలో వ్యవసాయ కార్మికులు, రైతులు, పేద ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల నాయకులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ, జి.రవిబాబు, ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ పేద ప్రజలకు పనులేని కాలంలో ఆర్థిక అండగా ఉంటున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తి వేసే కుట్రలు పన్నుతున్న బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టం-2005 వచ్చిన 20ఏళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఉన్న వ్యవసాయ కార్మికులు, పేదలు, రైతుల కుటుంబాలకు పనులు లేని కాలంలో వలసలు పోకుండా ఉపాధిహామీ పథకం కింద పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకున్నారని గుర్తు చేశారు. వ్యవసాయ సంక్షోభం వల్ల పని దినాలు తగ్గిపోయిన కాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు భరోసాగా ఉందన్నారు. పని హక్కుగా, భరోసాగా ఉన్న చట్టాన్ని పథకంగా మార్పు చేసి రద్దు చేసే కుట్రలు పన్నుతున్నారన్నారు. పని దినాలు తగ్గించి ఇప్పటి వరకు కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10శాతంగా ఉన్న మొత్తం ఖర్చు వాటాను కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం వాటాకి పెంచారనీ, పని చూపకపోతే ఇచ్చే నిరుద్యోగ భృతి, వేతనాలు చెల్లింపులు ఆలస్యం అయితే ఇచ్చే నష్ట పరిహారం, పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే చెల్లించే నష్ట పరిహారాలు, సౌకర్యాలు కల్పించడానికి ఖర్చులు ఇచ్చే బాధ్యత రాష్ట్రాలపై పెట్టారన్నారు. దీనివల్ల లోటు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్ర పరిస్థితి మూలిగేనక్కపై తాటికాయ పడ్డ చందంలా తయారైందన్నారు. పని దినాలను 200 రోజులకు పెంచి రూ 600 వేతనం ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుంటే 125 రోజులకు పని దినాలు పెంచి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు పెంచకుండా, సకాలంలో వేతనాలు ఇవ్వకుండా కూలీలను మోసం చేసిందన్నారు. కొత్త చట్టంతో కాంట్రాక్టర్లు, యంత్రాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఆధార్ అనుసంధానం యాప్‌ల ద్వారా రెండు పూటలా హాజరు చట్టరీత్యా నేరమన్నారు. ప్రత్యక్షంగా జరిగే సోషల్ ఆడిట్ స్థానంలో ఆన్లైన్లో ఎంపిక చేసి ఏఐ ద్వారా సోషల్ ఆడిట్ చేయిస్తారన్నారు. గ్రామ పంచాయతీల ద్వారా కాకుండా కేంద్ర ప్రభుత్వం గ్రామాలను కేటగిరీలుగా విభజించి పనులు గుర్తించడం వలన పారదర్శకత లోపిస్తుందన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిర్ణయాలను మార్చుకోకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఆశ కార్యకర్తలు

సిఐటియు పతాక ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి

మండల కేంద్రమైన ఆర్టీసీ బస్టాండ్ వద్ద విశాఖ పట్నంలో జరుగుతున్న అఖిలభారత సిఐటియు 18వ మహాసభల జయప్రదం చేయాలని కోరుతూ ఆశ కార్యకర్తలు సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. ఆశా నాయకురాలు బుజ్జి మాట్లాడుతూ కార్మిక వర్గం కోసం స్కీం వర్కర్స్ కోసం సిఐటియు అనేక పోరాటాలు చేసి హక్కులు సాధించి పెట్టిందన్నారు. మహాసభను జయప్రదం చేయాలని ఆశ కార్యకర్తలని కోరారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలనీ, సంక్షేమ పథకాలను ఆశా కార్యకర్తలకు వర్తింపజేయాలని ఆమె డిమాండ్ చేశారు. జనవరి 4న విశాఖలో జరుగుతున్న కార్మిక బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బి.సూరి బాబు నాగమణి పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నేటి నుండి స్థానిక పిఎన్‌సి కెఆర్ కళాశాలలో పల్నాడు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు తెలిపారు. గురువారం పిఎన్.సి, కె.ఆర్ కళాశాలలో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించిన ప్లానింగ్ కమిటీ సమావేశం అయ్యారు. రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్సి ఈఆర్టీ, సమగ్ర శిక్ష, పల్నాడు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన, రాష్ట్ర బాల వైజ్ఞానిక ప్రదర్శన (ఆర్బివిపి), సదరన్ ఇండియా సైన్స్ ఫెస్టివల్ (ఎస్ఐ ఎస్ఎఫ్)ను నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఉదయం 7గంటలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు.జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజ శేఖర్, ప్రధానోపాధ్యాయులు ఆర్.గోవిందరాజు, బి.ఎం.సుభాని, వై.హనుమంతరావు, ఎం.రామారావు, సి.హెచ్. వి.ప్రసాద్, ఐవిఎం. రెడ్డి, ఏపి. మధుకుమార్ పాల్గొన్నారు.



ఖోఖో జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఖోఖో జట్టు సిద్ధం

ప్రజాశక్తి- బొల్లాపల్లి (ఈపూరు)

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ అండర్-18 బాల బాలికల జిల్లా ఖోఖో జట్లకు మండలంలోని బొగ్గరం జడ్పీహెచ్ఎస్‌లో మూడు రోజులపాటు చేపట్టిన శిక్షణ శిబిరం గురువారంతో ముగిసిందని అసోసియేషన్ అధ్యక్షులు వీరభద్రారెడ్డి తెలిపారు. ఈ జట్టు ఈనెల 19 నుంచి 21 వరకు ఉమ్మడి ప్రకాశం జిల్లా జె పంగులూరులో జరిగే అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు మద్దం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖోఖో అసోసియేషన్ సభ్యులు విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ వెంకయ్య, ప్రధానోపాధ్యాయులు మీనగ రామారావు, ఎస్ఎంసి చైర్మన్ ఎం.వెంకటరామయ్య, ఎన్ ఆంజనేయరాజు పాల్గొన్నారు.

చనిపోయిన వ్యక్తికి ఉపాధి హామీ కూలి

ప్రజాశక్తి - బొల్లాపల్లి (ఈపూరు)

మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై 17 విడత సామాజిక తనిఖీలు చేపట్టారు. సంతకాలు, వేలి ముద్రలు లేకుండానే ఉపాధి వేతనాలు చెల్లించినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం బహిరంగ ప్రజావేదిక నిర్వహించి ఉపాధి హామీ పనుల వివరాలను వెల్లడించింది. బొమ్మరాజుపల్లి గ్రామ పంచాయతీలో చనిపోయిన వ్యక్తికి వేతనం చెల్లించినట్లు సభలో తెలియజేశారు. ఫీడర్ ఛానల్ పనులకు సంబంధించి వర్క్ ఫైల్ ఫోటోలు లేకపోవడం పట్ల పిడి సిద్ధలింగమూర్తి,సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీలలో చూపని ఫోటోలను సిబ్బంది ప్రజావేదికలో చూపడం గమనార్హం. బోడెపూడి వారిపాలెంలో వై.వెంకాయమ్మ పేరిట 110 బత్తాయి మొక్కలు నాటినట్లు రికార్డులో ఉండగా పని ప్రదేశంలో ఒక మొక్క లేదని గుర్తించారు. డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి మాట్లాడుతూ



వర్క్‌ఫైల్ ఫోటోలు లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ

ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ.58,767లు రికవరీకి నమోదు చేశామన్నారు. జాబ్ కార్డులు అప్డేషన్ చేయని సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు. జియో ట్యాగింగ్ లేని ఫోటోలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కూలీలకు వందరోజులు పని దినాలు కల్పించాలని 300 సరాసరి వేతనం పొందేలా చూడాలని అన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి హీరాలాల్, ఏపీడి బూసి రెడ్డి, ఎస్ఆర్పి ఆవులయ్య, ఎంపీపీ ఈదర రాధిక, ఎంపీడీవో ఎ.ఉమాదేవి, ఏపీవోలు లక్ష్మణ్, పుష్పరాజ్ పాల్గొన్నారు.



ఖోఖో పోటీలకు ఎంపికైన జట్టు

ఖోఖో పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు

ప్రజాశక్తి - నకరికల్లు

ప్రకాశం జిల్లా జె.పంగులూరు మండలంలో ఈనెల 19, 20, 21వ తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు పాల్గొంటుందని జిల్లా సెక్రటరీ చింతాపుల్లయ్య గురువారం తెలిపారు. పుల్లయ్య మాట్లాడుతూ గుంటూరు జిల్లా జట్టు లో నకరికల్లు వంగావెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు బాలికలు పాల్గొంటున్నారన్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు జి ఝాన్సీ రాణి, విద్యా కమిటీ చైర్మన్ కాసా మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సిఐ శిక్షణతో ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన అభ్యర్థులతో సిఐ వెంకటరమణ

ప్రజాశక్తి - మాచర్ల

తురక కాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణ సిఐ వెంకటరమణ 100 మంది పైగా నిరుపేదలైన విద్యార్థులకు నెల్లూరులో ఉచిత కోచింగ్ ఇచ్చారు.ఆ కోచింగ్ తీసుకున్న వారిలో 12మంది కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. వీరిలో అయిదుగురు మంది మహిళాలు ఉన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. సిఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్, రైల్వే డిపార్ట్మెంట్లో గ్రూప్ డి ఎంపికయ్యారు. వీళ్ళంతా గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజ్‌లో ప్రస్తుతం పల్నాడు జిల్లా మాచర్ల టౌన్ సిఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సన్మాన గ్రహీత సీఐ వెంకటరమణ మాట్లాడుతూ కటిక పేదరికం అనుభవించి ఎస్సై ఉద్యోగం సాధించిన నేను నాలాగా పేదరికంలో విద్యార్థులకు నా వంతు సాయంగా ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి కొంతమందికి ఉద్యోగాలు వచ్చే విధంగా కృషి చేశానని అన్నారు. ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ ఒంకి పెంచలయ్య నా మీద నమ్మకంతో విద్యార్థులకు కోచింగ్ ఇచ్చేందుకు ఉచితంగా నాకు అప్ప చెప్పినందుకు ధన్యవాదాలు తెలియ జేస్తున్నానన్నారు. నాపై అధికారులు, నాతోటి మిత్రులు, శ్రేయోభిలాషులు అన్ని శాఖ అధికారులు సహకరించారన్నారు.

విద్యార్థికి భార్గవకు ప్రశంసలు

ప్రజాశక్తి - అచ్చంపేట



భార్గవకు మెమొంటో అందజేస్తున్న అగస్తియన్‌రెడ్డి

చెస్ పోటీలో గెలుపొందిన విద్యార్థి పి.భార్గవను వేల్పూరు జడ్పీపిహెచ్ పాఠశాల సిబ్బంది గురువారం ప్రశంసించారు. పాఠ శాల ప్రధానోపాధ్యాయులు అగస్తియన్ రెడ్డి మాట్లాడుతూ సంస్థల ఆధ్వర్యంలో సత్తనపల్లి జెడ్పిపి హెచ్ పాఠశాలలో 14 సంవత్సరాల లోపు విద్యార్థులకు16, 17 తేదీలలో జరిగిన చెస్ పోటీలలో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భార్గవ్ ప్రథమ స్థానం సాధించి మెమొంటోను, నగదు ప్రోత్సాహాన్ని అందుకున్నారన్నారు.

యాక్సిడెంట్స్ బ్లాక్ స్పాట్స్ గుర్తింపు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలంలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను అధికారులు గురువారం గుర్తించారు. సత్తెనపల్లి రూరల్ సిఐ ఎం. హైమారావు పిడుగురాళ్ళ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్. రాంబాబు ఆర్ అండ్ బి ఎఈ జగ దీష్, నేషనల్ హైవే ఎఈ ప్రకాశం జాయింటు ఇన్ స్పెక్షన్ వేశారు. నందిగామ అడ్డరోడ్డు,కంటెపూడి అడ్డరోడ్డులను పరి శీలించి, ఎక్కువ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్‌లను గుర్తిం చారు. వారు మాట్లాడుతూ అక్కడ ఎలాంటి రోడ్డు ప్రమా దాలు జరగకుండా నివారించడానికి ముందస్తు చర్యగా సైన్‌బోర్డులు, రేడియం స్టిక్కరింగ్, సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.



ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చొద్దు : రైతు సంఘం


పెదనందిపాడులో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేరు మారుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లును వెంటనే ఉపసంహరించు కోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర రావు డిమాండ్ చేశారు. ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పేరు మార్పును నిరసిస్తూ ఉపాధి హామీ బిల్లు ప్రతులను నాయకులు దగ్ధం చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శివశంకరరావు మాట్లాడుతూ వామపక్షాలు, ప్రజా సంఘాలు పోరాట ఫలితంగా 2006లో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాదిమంది పేదలు, వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ పథకం ద్వారా ఎంతో కొంత గ్రామాలలో పనులు చేసుకునే వారని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నిందని అన్నారు. ఈ పథకానికి నిధులు కేటాయించకుండా , పేదలకు పనులు కల్పించకుండా మోడీ ప్రభుత్వం తాత్సారం చేసిందని ఆయన మండిపడ్డారు. ఉపాధి హామీ పథకం చట్టంలో అనేక మార్పులను తీసుకువచ్చి గ్రామీణ పేదలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజీవక కమిషన్ గ్రామీణ్ బిల్లు పేరుతో తీసుకురావడం జాతిపిత మహాత్మా గాంధీని అవమానించడమే అవుతుందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌల్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, కెవిపిఎస్ తాడేపల్లి మండల నాయకులు నాగ పోగు విజయరాజు, శివయ్య, నాగరాజు, కొండయ్య, హెూచ్ మెన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు పిలుపు నిచ్చారు. గురువారం తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన వివిధ ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సి.ఐ.టి.యు మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షత వహించారు. వామపక్షాల పోరాటాల ఫలితంగా ,2005లో యుపిఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం తెచ్చిందని, చట్టప్రకారం వ్యవసాయ కూలీలు పనులు లేని రోజులలో ఉపాధి కోసం వలసలు పోకుండా, నివశించే గ్రామాలలోని ఉపాధి కల్పించే ఉద్దేశంతో, చట్టం చేశారని అన్నారు. కనీస వేతనం రోజుకు 250 రూపాయలు నిర్ణయించారని, పేదలకు ఎంతో వెసులుబాటుగా ఉన్న చట్టాన్ని, బిజెపి ప్రభుత్వం పేరు మార్చడమే కాకుండా, గాంధీ పేరు తొలగించడం అన్యాయమని అన్నారు. గతంలో జాతీయ గ్రామీణ ఉపాధికి కేంద్రం 90 శాతం, రాష్ట్రాలు 10 శాతం నిధులు కేటాయించే వారని, మార్పు ఫలితంగా, కేంద్రం 60శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించాలని నిబంధనలు విధించడం, రాష్ట్రాలపై అదనపు భారాలు మోపడమేనని అన్నారు. ఇప్పటికే జిఎస్టి పేరుతో రాష్ట్రాల ఆదాయ వనరులను, కేంద్రం కొల్లగొడుతుందని, మరల 40 శాతం భారం మోపడం సరికాదని అన్నారు . ఈ చట్టాన్ని రద్దు చేసే కుట్రలు చేస్తున్నట్లు వెల్లడవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరే కంగా పేదలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల నాయకులు రమేష్ బాబు మాట్లాడుతూ ,అనేక ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న ,జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలని పిలుపు నిచ్చారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో ఉన్న పొరపాట్లను సవరించి, చట్టాన్ని పటిష్టం చేయాలని, సంవత్సరానికి 200 పనిదినాలు కల్పించి, కనీస వేతనం రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పెన్షనర్స్ సంఘం నాయకులు జంపని రామారావు ,రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర, కె.లక్ష్మి, ప్రియ, తదితరులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

టిడిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో
ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-దుగ్గిరాల

టిడిపి మండల ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెటింగ్ యాడ్‌లో గురువారం సెమీక్రిస్మస్ ఘనంగా వేడుకలు జరిగాయి. యార్డు చైర్మన్ ఝాన్సీ నేతృత్వం వహించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, వర్ల రామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టినా, ఏపీ ఐసీసీ డైరెక్టర్ కనికళ్ళ చిరంజీవి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, ఎంపీపీ షేక్ జబీన్, స్థానిక నాయకులు గూడూరు వెంకటరావు వెనుకల కృష్ణప్రసాద్, పాటిబండ్ల కృష్ణప్రసాద్, కొరిటాల సురేష్, సిద్ధల శ్రీవాణి, ఉజ్వల హరిణి, యార్డు సెక్రెటరీ సుబ్బారావు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభ జయప్రదం కోసం ప్రచారం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఉండవల్లి సెంటర్లో గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ నాయకులు ఎం.రవి మాట్లాడుతూ విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జరగనున్నాయని తెలిపారు. కార్మికవాడల్లో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజధాని ప్రాంతంలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిఐటియు పెద్ద ఎత్తున ఆందోళన చేసిన ఫలితంగా కార్మికుల సమస్యలు కొన్ని పరిష్కారం అయ్యాయని అన్నారు. కార్మికులకు అండదండగా సిఐటియు ఎర్రజెండా ఎల్లవేళలా నిలుస్తుందని అన్నారు. ఎర్రజెండా అండతో కార్మికులు అనేక హక్కులు సాధించుకున్నారని చెప్పారు. కార్పొరేట్ల అడుగులకు మడుగులు వత్తుతున్న పాలకవర్గాలు, కార్మిక వర్గం అనేక త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులను కాలరాచేందుకు ప్రయత్నిస్తే సిఐటియు చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. సిఐటియు అఖిలభారత మహాసభల సందరరేగా జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే కార్మిక మహా ర్యాలీలో రాజధాని ప్రాంతం నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రజా సంఘాల నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, టి బక్కిరెడ్డి, సిహెచ్. సుందరరావు, ఆర్.వి.రాఘవయ్య, కె.రామకృష్ణ, సైకం వెంకటనారాయణ, పి.గాంధీ, ఉండవల్లి పార్థసారథి, మున్సిపల్ యూనియన్ నాయకులు ఏ నారాయణ, స్వర్ణకుమారి, ఎడ్ల సుందరరావు, కుచేలరావు, బాబురావు, శ్రావణి, సుజాత, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నల్ల కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలి : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న బాబుప్రసాద్

ప్రజాశక్తి - తెనాలిరూరల్

నల్ల కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా పోరాడలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ అన్నారు. దాల్‌మిల్ ముఠా వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘం ఐదవ మహాసభలను చుక్కపల్లి శేషగిరి అధ్యక్షతన గురువారం జరిగింది. బాబుప్రసాద్ మాట్లాడుతూ యజమానులకు అను కూలంగా నిర్ణయాలు చేస్తున్న ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు. ప్రభుత్వం 29 కార్మికు చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కూడా తెచ్చారని, 2019 కరోనా కష్టకాలంలో వేతనాలు కోడ్, 2020 లో ఇండస్ట్రియల్ రిలేషన్ల కోడ్ తెచ్చారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత 2025 నవంబరు 21న వాటి అమలుకు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. కోడ్లకు వ్యతిరేకంగా నవంబర్ 26న కార్మికులు, రైతు సంఘాలు దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని గుర్తు చేశారు. లేబర్ కోడ్లు అమలైతే కార్మికులకు సమ్మె చేసే అవకాశం ఉండదని, కార్మిక సంఘాలు బతికి బట్టకట్టే పరిస్థితి ఉండదన్నారు. అంతేకాకుండా 70 శాతం పరిశ్రమలలో కార్మికులకు చట్టాలు వర్తించే పరిస్థితి ఉండదన్నారు. ఇదే విధానం కొనసాగితే లేబర్ కోర్టులు స్థానాల్లో ట్రిబ్యునల్ కోర్టులు వెలుస్తా యన్నారు. కార్మికులు సమ్మె చేసే హక్కు, సంఘం నడుపుకునే పరిస్థితి లేకపోవడంతో బేరసారాలకు అవకాశం లేక కార్మికులు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. నల్ల చట్టాలు, కోడ్లు రద్దు అయ్యే వరకు కార్మికులంతా సమిష్టిగా పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. రైతు సంఘాలు సమిష్టిగా 13 నెలలు ఢిల్లీలో పోరాడి తమకు వ్యతిరేకంగా వచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయించారని తెలిపారు. యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ వలీ మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో సిఐటియు 18 అఖిల భారత మహాసభలు జరుగుతు న్నాయని, సభ ద్వారా దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి పరిష్కారానికి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జి.వెంకట సుబ్బయ్య, జె.వెంకటేశ్వరరావు, టి.వీరాంజనేయులు, టి.చంద్రశేఖరరావు, బి.మాధవరావు, టి.కాశీ విశ్వనాథ్, డి.పవన్‌తేజ, కె.నాగరాజు, టి.వాసు, శివ నాగేశ్వరరావు, గంటా శ్రీనివాసరావు, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, కె.చంద్రశేఖర రావు, డి.పవన్ తేజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు ఇవ్వడానికి తెచ్చిన మందులు

అరకొర మందులతో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రజల ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ (104) గ్రామాలలో జనాభా బట్టి ప్రధాన సెంటర్లలో లేదా ప్రభుత్వం కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమం మంచిగా ఉన్నపటికీ ఆరోగ్య సమస్యలు చూపించుకున్న ప్రజలకు అరకొర మందులు ఇవ్వడం తో నెలకు సరిపడ ఇవ్వాలన్న ఒక వారానికి మాత్రమే సరి పోను ఇస్తున్నారు.అని ప్రజలు తెలుపుతున్నారు. గురువారం ప్రత్తిపాడు మండల పరిధిలోని కొండే పాడు గ్రామం లో ఫ్యామిలీ డాక్టర్ (104) రావడం తో అప్పటికే గ్రామంలోని వృద్ధులు అక్కడికి చేరుకొని వారికున్న ఆరోగ్య సమస్యలు డాక్టర్ వద్ద చూపించు కొని మందులు తీసుకుందామని వెళ్లగా అక్కడ మందులు సరిపడనన్నీ లేక పోవడంతో ఉన్న వాటినే సరి చేసి నెలకు వాడాల్సిన మందులు కేవలం వారానికే ఇవ్వడంతో మిగిలినవి ఎక్కడ తెచ్చుకోవాలి బయట తీసుకోవాలి అంటే డబ్బులు లేవని అంటున్నారు. ఇదిలా ఉంటే రెండు నెలల నుండి ఇలానే ఉంది అని చూపించు కోవడానికి వచ్చినా వారు తెలుపుతున్నారు. గురువారం మొత్తం 38 మంది ఫ్యామిలీ డాక్టర్ ఉపయోగించుకున్నారు అని ఎక్కువ మంది బిపి, షుగర్ సమస్య ఉన్నవారు ఉన్నారని, చిన్న పిల్లల్లో కూడా ఇలాంటి సమస్య ఉందని డాక్టర్ తెలిపారు.



గంగాప్రసాద్‌ను అభినందిస్తున్న లావు రత్తయ్య

విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకునికి పిహెచ్‌డి

ప్రజాశక్తి - గుంటూరు

వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ గుంటుపల్లి గంగాప్రసాద్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. గంగాప్రసాద్ 'అడాప్టివ్ రౌటింగ్ టెక్నిక్స్ ఫర్ మొబైల్ అడహక్ నెట్‌వర్క్స్ విత్ అన్‌స్టేబుల్ లింక్స్' అనే అంశంపై విస్తృతమైన పరిశోధన నిర్వహించారని, ప్రొఫెసర్ డాక్టర్ బి.సీతారామాంజనేయులు గైడ్‌గా వ్యవహరించారని తెలిపారు. గంగాప్రసాద్‌ను విజ్ఞాన్స్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ప్రొఫెసర్ నాగభూషణ్ అభినందించారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

చలపతిలో బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు జరిగే బ్యాట్మింటన్ టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. మొదటి రోజు జరిగిన పోటీల్లో మొదటి స్థానాన్ని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి, రెండోస్థానాన్ని చిప్స్ కాలేజి, మూడోస్థానాన్ని మైలవరం ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజి సాధించాయి. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ వై.వి.ఆంజనేయులు, సెక్రటరీ వై.సుజిత్‌కుమార్ అభినందించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మదార్‌సాహెబ్, తదితరులు

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - దుర్గి

అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు షేక్ పాషావలి ఆధ్వర్యంలో సేవా సమితి కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో షేక్ నసీర్‌అహ్మద్ రచించిన "అల్లూరి సీతా రామరాజు స్వాతంత్ర పోరాటంలో సహకరించిన ఫజులుల్లా ఖాన్, షేక్ మదీనా ప్రముఖ పాత్ర" పుస్తకాన్ని మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్ ఆవిష్కరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ జలీల్, రిటైర్డ్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గాదే రామకష్ణారావు, ప్రతిభ పల్నాడు జూనియర్ కాలేజీల సెక్రటరీ కరస్పాండెంట్ పఠాన్ నాగూర్‌వలి, సీనియర్ జర్నలిస్టు సులేమాన్, ఓరుగంటి చెన్నకేశవరావు, మన్నెం పాండురంగారావు, ఆయేషా సుల్తానా టీచర్, ఈశ్వరయ్య మాస్టర్ పాల్గొని నశీర్ అహ్మద్ రచనలను కొనియాడారు. ఇటువంటి రచనలు ద్వారా స్వాతంత్ర సమరయోధుల గాథలను నేటి తరాల వారికి తెలియజేయడం గొప్ప విషయమన్నారు.



పీడీని కలిసిన యూనియన్ నాయకులు

గృహనిర్మాణ శాఖ పీడీని కలిసిన నాయకులు

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు జిల్లా గృహశాఖ నూతన పీడీగా బాధ్యతలు స్వీకరించిన యు. ప్రసాద్‌ను గురువారం జిల్లా యూనియన్ నాయకులు ఎస్.మరియదాసు, జిల్లా యూనియన్ సభ్యులు కలసి అభినందనలు తెలిపారు. హౌసింగ్ పురోగతిపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యో గుల పలు సమస్యలను వివరించారు. వీటిపై పీడీ ప్రసాద్ సానుకూలంగా స్పందించి పైఅధికారులకు తెలియ చేస్తానని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.



క్రీడా సామగ్రి అందజేసిన నరసింహారావు

క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - యడ్లపాడు

లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం గ్రామానికి చెందిన నంబూరు నరసింహారావు రూ.15వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. సౌండ్ సిస్టం, స్పీకర్ బాక్స్‌ను అందజేశారు. పాఠశాలలోని విద్యార్థులు దాతలు అందించిన సౌకర్యాలను వినియోగించు కొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయులు కేవీ రామిరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ నజీర్ అహ్మద్, నంబూరు నరసింహారావు, నంబూరు శివరామకృష్ణ, తోకల సత్యనారాయణ, ఉపాధ్యాయులు వి. శ్రీనివాసరావు, ఎస్.వరప్రసాద్ రెడ్డి, ఎం.కిరణ్‌కుమార్, కే.హేమలత, వి,విజయహారతి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.



నూతన గోదాం ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే, తదితరులు

రూ.5.56 కోట్లతో గోదాము

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ (జిడిసిఎంఎస్) ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలో రూ 5.56 కోట్లతో నిర్మించిన 2.6 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన నూతన గోదామును రైతుల ప్రగతికి అంకితం చేస్తున్నామని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం గుంటూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబుతో కలిసి గోదామును పరిశీలించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ వడ్రాణం హరిబాబు, ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి టిడిపి కూటమి కట్టుబడి ఉంద న్నారు. సహకార సంఘాలను బలోపేతం చేసుకుని రైతులు ఆర్థికాభివృద్ధి సాదించాలన్నారు. మార్కెటింగ్ సొసైటీ ద్వారా రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో రూ 15 వేల కోట్లతో 50 లక్షల మెట్రిక్ ధాన్యం కొనుగోలు టిడిపి కూటమి రంగం సిద్ధం చేసిందన్నారు. దీనిలో భాగంగా పల్నాడు జిల్లాలో 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జ్ మంత్రి, కలెక్టర్, ఎంపి, చీఫ్ విప్, ఎమ్మెల్సీలు, పల్నాడు ఎమ్మెల్యేలు జిడిసిసి బ్యాంక్ చైర్మన్, అయ్యా సహకార సంఘాల అధ్యక్షులు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

బాల మహోత్సవ్‌లో జెడ్‌పి విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - పెదకూరపాడు

క్రీడలను ప్రోత్సహించి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభగలగిన క్రీడాకారులను వెలికితీసే లక్ష్యంలో సత్తెనపల్లి సుగాలి కాలనీలోని జడ్పీ హైస్కూల్లో రెండు రోజులుగా వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ నిర్వహించిన బాల మహోత్సవ్ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ క్రీడల్లో పెదకూరపాడు జిఆర్‌సి ఆర్ కే శ్రీచైతన్య పాఠశాల చాటింది. అండర్-17 వాలిబాల్ బాలుర, బాలికలు విభాగంలో ప్రథమంగా నిలిచింది. అండర్ 17 కబడ్డీ బాలుర విభాగంలో విన్నర్స్ నిలిచింది. అండర్-17లో 100 మీటర్ల పరుగు పందెంలో శేషసాయి, అండర్-14 బాలుర విభాగంలో షేక్ రియాజ్లు ప్రథమంగా నిలిచారు. జిఆర్‌సిఆర్ కే శ్రీ చైతన్య పాఠశాల నిర్వాహకులు గుత్తా రాము, ప్రతిభ చాటిన క్రీడా జట్లకు షీల్డ్, నగదు బహుమతులను విజ్ఞాన్ క్రీడల నిర్వాహకులు కల్నల్, ప్రొఫెసర్ నాగభూషణ్ అందించారు.



క్రీడాకారులకు షీల్డు, నగదు అందజేస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు టైఫాయిడ్ నిరోధక టీకాలు

ప్రజాశక్తి - మాచర్ల

ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లైన్స్ క్లబ్ ఆఫ్ చెన్నకేశవ, రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల వారిచే ప్రత్యేక వ్యాధి నిరోధక టైఫాయిడ్ టీకా శిబిరాన్ని కిడ్స్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు రామకృష్ణ శాస్త్రి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య, లైన్స్ క్లబ్ ఆఫ్ చెన్నకేశవ అధ్యక్షులు జి.రాజశేఖర్ రెడ్డి, కార్యదర్శి మేడం పుల్లారావు, రోటరీ అధ్యక్షులు తుమ్మల సత్యప్రసాద్, భారత్ బయోటిక్ లిమిటెడ్ ప్రతినిధి రాజశేఖర్ ఆధ్వర్యంలో కేవలం రూ.100లకు పాఠశాలలోని విద్యార్థులకు టైఫాయిడ్ టీకాలను వేశారు. ఈ టీకా వలన పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి, జ్వరాలు రాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమం లో రోటరీ ఎలక్ట్ ప్రెసిడెంట్ పఠాన్ నాగూర్‌వలి, కెమెరా నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థికి టీకా వేస్తున్న వైద్యులు

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గం బొల్లాపల్లి మండలంలో వెల్లటూరు గ్రామంలో వినుకొండ రూరల్ సీఐ బ్రహ్మయ్య, బొల్లాపల్లి మండల ఎస్సై సమీర్‌బాష సమక్షంలో ప్రజలతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో ఫ్యాక్షన్ లేకుండా ఎటువంటి గొడవలకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరాలు, కొత్త చట్టాలు, మైనర్ పిల్లలపై జరుగుతున్న నేరాలు, ఫోక్‌షో చట్టం గురించి వివరించారు. రోడ్డు భద్రతలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, మైనర్ పిల్లలకు టూ వీలర్స్ ఇవ్వకూడదని, ఇన్సూరెన్స్ తప్పనిసరి అన్నారు. గ్రామాలలో ఎక్కడన్నా గంజాయి సేవించడం గాని అటవీ ప్రాంతంలో మొక్కలను పెంచినట్లు గమనిస్తే వారి వివరాలు సిఐ:9440796226, ఎస్ఐ :9440796249 నెంబర్లకు తెలియజేయాలని అన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ, ఎస్ఐ

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

ప్రజాశక్తి - రెంటచింతల

ఎంసీపీఐ(యూ) మాచర్ల డివిజన్ నేతలు గురువారం మండల కేంద్రమైన రెంటచింతల రైతు కూలీ సంఘ కార్యా లయంలో సమావేశమై పలు తీర్మానాలు చేశారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా స్వామినాథన్ కమిటి సిఫార్సులు అమలుపరచా లని, కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న పంటను క్వింటా రూ.2400కు తగ్గకుండా కొనుగోలు చేయాలనీ, వరిక పూడిశెల ఎత్తి పోతల ప్రాజెక్టును పూర్తి చేయడానికి కృషి చేయాలని తీర్మా నంలో పేర్కొన్నారు. సమావేశంలో డివిజన్ కమిటి కార్యదర్శి మాచవరపు నాగేశ్వరరావు, వీర్ల నీలమణి, గాలయ్య, వెంకటేశ్వర్లు, నీలమయ్య, చిన్నరామయ్య, ఆనందరావు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-రాజుపాలెం

విజ్ఞాన మహోత్సవంలో రాజుపాలెం జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారని ప్రధానోపా ధ్యాయురాలు పి శైలజ అన్నారు. అండర్ బి-14 వాలీబాల్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థాయిలో నిలిచారని, అండర్ బి-14 రన్నింగ్‌లో బాలికల విభాగంలో వి.సుజాత గోల్డ్ మెడల్ సాధించి మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో మరింతగా రాణించాలని ఆమె ఆకాంక్షించారు.



విద్యార్థులతో పోస్టరును ఆవిష్కరింపజేసిన ఉపాధ్యాయులు

లక్ష్య సాధన దిశగా విద్యార్థులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పసుమర్రులోని శ్రీ మద్దికామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆంగ్ల ఉపాధ్యాయులు షేక్ మొహమ్మద్ యాసీన్ తెలిపారు. ఆయన గత రికార్డుల కంటే మెరుగైన మార్కులు సాధిస్తామని మాట ఇచ్చిన 11మంది విద్యార్థుల ఫోటోలతో ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించి వాటి ప్రయోజనాలు వివరించారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని గుర్తుం చుకోవడానికి పోస్టర్లను తరగతి గదిలో, వారి ఇళ్లలో అంటించుకోవాలని సూచించారు. ఈ వినూత్న ఆలోచనను ప్రధానోపాధ్యాయులు యడవల్లి హనుమంత రావు అభినందిస్తూ, విద్యార్థులు సమయాన్ని చదువుకే కేటాయించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ హుస్సేన్

ఓటరు జాబితాపై పార్టీలతో సమావేశం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశాన్ని గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో భాగంగా 18ఏళ్లు నిండిన వారిని నూతన ఓటర్లుగా చేర్పించాలని, చనిపోయిన ఓటర్ల వివరాలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలు ఎప్పటికప్పుడు రాజకీయ పక్షాల ప్రతినిధులు స్థానిక బిఎల్‌ఓలకు అందించాలని పేట తహశీల్దార్ హుస్సేన్ పార్టీ ప్రతినిధులను కోరారు. స్థానిక పార్టీ ప్రతినిధుల సహకారంతో ఓటరు జాబితా స్వచ్ఛీకరణ సాధ్యపడుతుందని, 1200కు పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌లను విభజించే ప్రక్రియ పూర్తయిందని, 2002 ఓటర్ల జాబితాతో ప్రస్తుత జాబితా మ్యాపింగ్ చేసే కార్యక్రమం కూడా దాదాపు పూర్తి అయిందని తెలిపారు. సమావేశంలో పార్టీల ప్రతినిధులు మురకొండ మల్లిబాబు, షేక్ అజహారుద్దీన్, విడదల శ్రీనివాసరావు, యం.రాధాకృష్ణారావు సుబ్రహ్మణ్యం, సాంబశివరావు పాల్గొన్నారు.



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే 'కన్నా'

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రపంచ మానవాళికి క్రీస్తు చేసిన బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు గురువారం సత్తెనపల్లి పట్టణంలోని ఐఎంఎ ఫంక్షన్ హాల్‌లో పట్టణ పాస్టర్లు ఏర్పాటు చేసిన గ్రాండ్ క్రిస్మస్ వేడుక లోఎమ్మెల్యే పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డి.నాగే శ్వరరావు పట్టణ అధ్యక్షులు మస్తాన్‌వలీ కె.శ్రీనివాసరావు పాస్టర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7

గుంటూరు జిల్లా

శుక్రవారం 19 డిసెంబర్ 2025

పోలియో నిర్మూలనకు సహకరించాలి

ప్రజాశక్తి - పెదకాకాని

పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని మండల అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపిడివో కార్యాలయంలో గురువారం మండల టాస్క్ ఫోర్స్ సమావేశం జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 21 తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో ముందుగా నిర్దేశించిన వివిధ శాఖల సిబ్బంది విధిగా పాల్గొనాలని, అప్పుడే పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల వయసు కలిగిన చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. 22వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమంలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకొని చిన్నారుల వద్దకు వెళ్లి విధిగా నూరు శాతం పల్స్ పోలియో కార్యక్రమం మండలంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ దీప్తి, ఎంఈఓ బివి రమణయ్య, ఈవో పిఆర్.డి కె.శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రెటరీ ప్రసాద్,హెల్త్ సిబ్బంది సుకుమార్, సాంబశివరావు, పద్మ, దేవి పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని , శాస్త్రీయ ద అక్పథాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి 2 ఆర్ సుబ్బారావు అన్నారు . జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాకోడురూలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనను ఎంఈఓ రాయల సుబ్బారావు, ఆర్.చలపతిరావు ప్రారంభించారు. మండలంలోని ఆరు పాఠశాల నుండి ఏడు అంశాలపై విద్యార్థులు ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. విద్యార్థులు యొక్క శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభిలాషను వ్యక్తం చేస్తూ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారని ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. ఎంఈవో సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞా నాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వరావు, ఆంజనేయులు, రవికుమార్, నాగరాజు, శివ శంకరు విద్యార్థులు పాల్గొన్నారు.

మోసానికి పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి- తాడేపల్లి

వినియోగదారులను ఎవరైనా షాపు యాజమాన్యం తూకం తగ్గించి ఇచ్చిన, క్వాలిటీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని తెనాలి డివిజన్ లీగల్ మెట్రోలజీ సిఐ శేషసాయి హెచ్చరించారు. డిసెంబర్ 24వ తేదీన జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో లీగల్ మెట్రోలజీ అధికారులు వినియోగదారులకు అవగాహన సదస్సులు ఏర్పాటు తోపాటు పలు సూపర్ మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించారు. వినియోగదారులను ఎవరైనా షాపు యాజమాన్యం వారు తూకం క్వాలిటీ విషయంలో మోసం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవికిషోర్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై టిజెపిఎస్‌లో అవగాహన

ప్రజాశక్తి - గుంటూరు



మాట్లాడుతున్న రేవతి రఘునాథన్

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో విద్యార్థులకు భవిష్యత్ వృత్తి అవకాశాలపై అవగాహనకు కెరీర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాకు చెందిన దక్షిణ భారత ప్రాంతీయ మండలి చైర్‌పర్సన్ రేవతి రఘునాథన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా చార్టర్డ్ అకౌంటెంట్స్ వృత్తి ప్రాముఖ్యత, ఐసిఎఐ పాత్ర, విద్యార్థులకు అందుబాటులో ఉన్న వృత్తి అవకాశాలు, అవసరమైన నైపుణ్యాల గురించి రేవతి రఘునాథన్ వివరించారు. ముప్పాళ్ల సుబ్బారావు, కళాశాల సెక్రెటరీ కె.వి.బ్రహ్మం అధ్యక్షత వహించగా, ప్రిన్సిపాల్ డాక్టర్ బివిహెచ్ కామేశ్వర శాస్త్రి, పీజీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, డాక్టర్ యూ.రవికుమార్, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ నిర్మలరాణి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసేలా ప్రజల్లో చైతన్యం తేవాలి

ప్రజాశక్తి - మంగళగిరి



మాట్లాడుతున్న కమిషనర్ అలీం బాషా

ఇంటి వద్దనే తడి, పొడి వేరుచేసి అందించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని కమిషనర్ అలీం బాషా తెలిపారు. గురువారం పారిశుద్ధ్య విభాగం ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, స్వచ్ఛ అంబాసిడర్లకు శిక్షణ జిరగింది. కమిషనర్ మాట్లాడుతూ ఐటీసీ, మారి సంస్థల సమన్వయంతో ఏర్పాటు చేసిన ఈ శిక్షణలో తడి, పొడి చెత్తను వేరు చేసే విధానంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య సిబ్బందికి సాంకేతిక సహకారం అందించడం, గృహాలు, వ్యాపార సంస్థల నుంచి వచ్చే చెత్తను కాలువల్లో, రోడ్లపై పడేయకుండా చూడాలన్నారు. పొడి చెత్తలో ఉన్న సుమారు 20 రకాల వ్యర్థాలను విడదీసి, అవసరమైన యంత్రాల సహాయంతో శుభ్రపరిచి సీసాలు, ఇనుప వస్తువులు, కాగితాలను వేర్వేరుగా రీసైక్లింగ్ సంస్థలకు తరలించే ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. నగర పరిశుభ్రత, సుందరీకరణ లక్ష్యంగా చేపడుతున్న బృహత్తర కార్యక్రమాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని పారిశుద్ధ్య సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, సెక్రటరీ డి.శ్రీనివాసరావు, ఐటీసీ మారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.మురళి, డిప్యూటీ జనరల్ మేనేజర్ వై.ఎన్. ఉమాకాంత్, ప్రాజెక్ట్ మేనేజర్ సుధా, శానిటరీ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది, సూపర్‌వైజర్లు, స్వచ్ఛ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు బెడ్‌షీట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - చేబ్రోలు

సాంఘిక సంక్షేమ కాలేజీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ వెల్ఫేర్ అధికారి గురువారం తెలిపారు. మొత్తం 51 మంది విద్యార్థులకు బెడ్ షీట్లను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మైలా వెంకటరామరాజు , మండల ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్లో చదువుతున్న ప్రతి పేద విద్యార్థికి చదువుకి ఏ ఆటంకం ఉండకూడదని స్థానిక శాసనసభ్యులు వారి సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆకాంక్ష మేరకు మంచి ఉద్యోగాల్లో స్థిరపడేలా చదవాలని సూచించారు. సాంఘిక సంక్షేమ వసతి గ అహములో చదువుతున్న విద్యార్థులు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అత్యుత్తమ విద్యాభ్యాసంతోనే ఈరోజు ఇంజనీరింగ్ చదువు తున్నారని, ఇదే ప్రగతిని విద్యార్థులు కొనసాగించాలని ఆకాంక్షించారు.

గ్రాండ్ సెమీక్రిస్మస్ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఏసుక్రీస్తు బోధనలు కేవలం నైతిక మార్గదర్శకాలు మాత్రమే కాదని, శాశ్వత జీవితానికి మార్గమని మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు శుద్ధపల్లి నాగరాజు అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు అనుసరిస్తూ మాస్ సంస్థ గత 22 ఏళ్లగా ఐక్య గ్రాండ్ సెమి క్రిస్టమస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెమీ క్రిస్టమస్ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హార్వెస్ట్ ఇండియా అధ్యక్షులు కత్తెర డేవిడ్ యస్వంత్, రాక్ గాస్పెల్ చర్చి వ్యవస్థాపకులు బిషప్ పినపాటి జాన్ పాల్, హోసన్నా ప్రేయర్ మినిస్ట్రీస్ నిర్వాహకులు బ్రదర్ వి.సాల్మన్ రాజు, టిడిపి పట్టణ ఎస్‌సి అధ్యక్షులు అత్తోట శరత్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. డిసెంబర్ 23న స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎస్‌సి కార్పొరేషన్ కాంప్లెక్స్ వద్ద నిర్వహించనున్న సెమి క్రిస్టమస్ వేడుకలు జరగనున్నాయి. నాగరాజు మాట్లాడుతూ గత 22 ఏళ్లగా నిర్వహిస్తున్న సెమి క్రిస్టమస్ వేడుకలు వెనుక ఎంతోమంది దాతలు సహకారం ఉందని అన్నారు. కార్యక్రమంలో బిజెఎ వ్యవస్థాపకులు మేకల సురేష్, దైవసేవకులు విలియం కేరీ, ఇందుపల్లి రాజా రామ్, పినపాటి సురేష్, అత్తోట శ్యామ్, కూచిపూడి మోహన్, కొక్కిలిగడ్డ సునీల్, లింగాల రమేష్, కోట్ల దిలీప్, కొలకలూరి కిరణ్, మాస్ నాయకులు పాల్గొన్నారు.

జననీ సీడ్స్ పత్తి ప్రదర్శన

ప్రజాశక్తి - కాకుమాను (ప్రత్తిపాడు)

జననీ సీడ్స్ పత్తి ప్రదర్శన గురువారం ప్రత్తిపాడు మండల పరిధిలోని తిక్కిరెడ్డి పాలెంలో సి.హెచ్ అమరనాథ్ పొలంలో జననీ - 555 ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ జోనల్ మేనేజర్ టి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ జననీ సీడ్స్ 555 బి4 జూ రకం అధిక వర్షాలు తెగుళ్లను సైతం తట్టుకొని ప్రత్తి తీత అనుకూలంగా ఉండి అధిక దిగుబడులు ఇస్తుందని తెలిపారు. అనంతరం రైతును సన్మానించారు ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి- పెదనందిపాడు (కాకుమాను)

ప్రభుత్వం వారు నిర్దేశించిన సమయాల ప్రకారం రేషన్ షాపులు ఓపెన్ చేసి ఉంచాలని, 65 సంవత్సరాలు దాటిన వారికి 30వ తారీఖు లోపు డిస్ట్రిబ్యూషన్ కంప్లీట్ చేయాలని, స్టాక్ బోర్డులు మెయింటైన్ చేయాలని, కార్డుదారులకు సకాలంలో డిస్ట్రిబ్యూషన్ పంపిణీ పూర్తి చేయాలని గురువారం కాకుమాను రేషన్ డీలర్ల సమావేశంలో సిఎస్‌డిటి శివశంకర్ తెలిపారు.

ఘనంగా మండల స్థాయి సైన్స్ ఫెయిర్

ప్రజాశక్తి - కాకుమాను

స్థానిక ఎన్.జెడ్.పి.హెచ్.ఎస్. (కాకుమాను హైస్కూల్) పాఠశాలలో 2025 -26 విద్యా సంవత్సరానికి సంబంధించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఎంఈఓ 1 కె.ఎఫ్. కెనడి గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సస్టైనబుల్ అగ్రికల్చర్, వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ ఆల్టర్నేటివ్స్ టు ప్లాస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, హెల్త్ అండ్ హైజీన్, వాటర్ కన్సర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నల్లబర్లీ పొగాకు సాగు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - కాకుమాను (ప్రత్తిపాడు)

నల్లబర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని, రైతులు సాగు చేయవద్దని జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి తెలిపారు. గురువారం టాస్క్‌ఫోర్స్ టీం, ఆర్ఎస్‌కె సిబ్బంది ద్వారా నల్లబర్లీ సాగు చేయరాదని శిక్షణా కార్యక్రమాలు, కరపత్రాలు పంపిణీ, వివిధ మాధ్యమాల ద్వారా రైతులకు తెలియపరచినప్పటికీ ఇంకా కొంతమంది రైతులు నల్ల బర్లీ సాగు చేస్తున్నారని సమాచారం అందడంతో గురువారం నియోజక వర్గ కేంద్రం ప్రత్తిపాడు, పెదనందిపాడు మండలాల గ్రామాలైన వరగాని, పాత మల్లాయపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పర్యటించారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మేనేజర్ నరసింహారెడ్డి, గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ మోహన్ రావు మోహన్ రావు, మండల తహశీల్దార్ హేనప్రియా రైతులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

380వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 380 రోజులకు చేరుకున్నాయి. దీక్షలను కార్మికనాయకులు కె.స్టీవెన్, బి.సూర్యప్రకాష్, బి.అంకయ్య, డి.నాగేశ్వరావు, షేక్ సుభాని ప్రారంభించారు. దీక్షల్లో మహిళలు వై.రమాదేవి, మొలక శారదా, వేములలక్ష్మి, శారమ్మ, దామవరపు సువర్ణకుమారి, కూర్చున్నారు. కార్యక్రమంలో ఎం.గురవయ్య, పిచ్చయ్య, ఆశీర్వాదం, తుపాకుల నాగేశ్వరావు పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్‌లో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీలో గురువారం హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందరరేగా జరిగిన వేడుక సభకు హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పిఅనూష అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా డిఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి హాజరయ్యారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎమ్ఓ డాక్టర్ సుజాత, ఎన్సీడీసీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రోహిణి, లెప్రసీ డీపీఎమ్ఓ జోసెఫ్, కుప్పురావు కాలనీ యూపీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు ఎస్ఐగా సత్యనారాయణ

ప్రజాశక్తి - పెదనందిపాడు



పెదనందిపాడు మండల నూతన ఎస్ఐగా సిహెచ్. సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వీరు గుంటూరు నల్లపాడు నుండి బదిలీపై పెదనందిపాడు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న అద్దంకి మధు పవన్ నల్లపాడుకు బదిలీపై వెళ్లారు. మండలంలో శాంతిభద్రతలు కాపాడటానికి అహర్నిశలూ కృషి చేస్తానని సత్యనారాయణ తెలియజేశారు.

21న పల్స్ పోలియో

ప్రజాశక్తి - కాకుమాను (పెదనందిపాడు)

ఈనెల 21వ తేదీ ఆదివారం జరగబోవు పల్స్ పోలియో కార్యక్రమం గురించి గురువారం పెందనందిపాడు పీహెచ్‌సిలో పోలియో బూత్ వాక్సినేటర్స్, రూట్ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.ప్రియంవద, డాక్టర్ ఎస్.నందకుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ ప్రసాదస్వామి, హెచ్ఈ షేక్‌సుజ, సిబ్బంది చెన్నయ్య, పి.అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తహశీల్దార్ కె.శ్రీనివాస్‌శర్మ తెలిపారు. గురువారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, వైద్యాధికారి దుర్గాప్రసాద్, ఎంఈఓ ఆర్.సుబ్బారావు, టిడిపి మండలాధ్యక్షులు మైలా వెంకటరామ రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పల్స్ పోలియో పోస్టర్ను ఆవిష్కరించారు. తహశీల్దార్ శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ 21వ తేదీ ఆదివారం ఐదు ఏళ్ల వయసు వరకు గల ప్రతి చిన్నారికి, ప్రతిసారి పోలియో మోతాదు ఇవ్వటం జరుగుతుందని, పిల్లలకు రక్షణ కల్పించడంలో ఎలాంటి అశ్రద్ధ, తప్పులు చేయవద్దని సిబ్బందికి ఆయన సూచించారు. పోలియో రహిత దేశం అయినప్పటికీ అది తిరిగి రావచ్చని, పోలియోపై విజయం సాధించడంలో ప్రతిసారి చిన్నారులకు పోలియో చుక్కలు ఇచ్చి తోడ్పడాలని కోరారు .



చెస్ టోర్నమెంట్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

21న రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - తాడికొండ

చలపతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో ఈ నెల 21వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్ -2025 నిర్వహించ బడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరః నల్లాని వెంకటరామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను శ్రీ ఆనంద్ ఈ చెస్ వింగ్స్ అండ్ ఏపిసిఏ విభాగం వారు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో అన్ని వయసుల వారు అన్ని కళాశాలల పాల్గొనవచ్చునని తెలిపారు. పాల్గొన్నదలచిన వారు 500 రుసుము చెల్లించాలని తెలిపారు 20వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పోటీలు చలపతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, మోతడకలో జరుగుతయని తెలిపారు.




విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్

చిత్రలేఖనంలో సుమేధ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో రెయిన్‌బో ఆర్ట్స్ అకాడమీ గుజరాత్ వారు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో 11 బెస్ట్ పెరఫార్మెన్స్, 40 బంగారు, 35 రజత, 24 కాంస్య, మొత్తం 110 మెడల్స్ సాధించారని స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. చంద్రశేఖర్ రెడ్డిని కళారత్న అవార్డుతో సత్కరించారు. అధిక సంఖ్యలో మెడల్స్ సాధించటం పట్ల స్కూల్ డైరెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలలో ఆయా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మున్నంగి సంజీవరెడ్డి, హెచ్ఎం కె.రాంబాబు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్

ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చాగంటివారిపాలెం యువకుడు

ప్రజాశక్తి-ముప్పాళ్ల



మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన యువకుడు వేములపాటి విశ్వనాథరెడ్డి ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో గ్రూపువై ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తెలంగాణలోని నల్గొండలో రామయ్య డిఫెన్స్ అకాడమీలో ఇంటర్ విద్యతో పాటు డిఫెన్స్‌లో శిక్షణ తీసుకుని ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగానికి ఎంపికైనట్లు విశ్వనాథ రెడ్డి తల్లిదండ్రులు వేములపాటి ఆదిలక్ష్మి,శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఫిజికల్ ఇతరత్రా టెస్టులలో ఎంపికై గత జూలైలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ గ్రూపు వై ఎగ్జామ్స్ ఎంట్రన్స్ టెస్టు వ్రాయగా ఈ నెలలో వచ్చిన ఫలితాలలో పాసై ఉద్యోగానికి ఎంపికయ్యాడు.ఈ నెల 29వతేదిన కరా?టక రాష్ట్రంలోని బెల్గాంలో ట్రైనింగ్ కు వెళ్ళుతున్నట్లు విశ్వనాథ రెడ్డి తెలిపారు.అతి చిన్న 18సంవత్సరాల వయసులోనే ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో ఉద్యోగానికి ఎంపిక కావడంతో రామయ్య డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ రామయ్య, శ్రీనివాస్ మరియు గ్రామ సర్పంచ్ పీలా గాయత్రీ లక్ష్మణ్, ఉప సర్పంచ్ అన్నపురెడ్డి రంగారెడ్డి, గ్రామ పెద్దలు చెక్కెర లక్ష్మీరెడ్డి, మధిర సీతారామిరెడ్డి మరియు బంధువులు అభినందనలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. ఇదిలావుంటే చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన యువకులు అత్యధికంగా త్రివిధ దళాలలో ఉద్యోగాలు సాధించారు.

డ్రగ్స్ మహమ్మారిపై యువత పోరాడాలి

ప్రజాశక్తి - గుంటూరు

డ్రగ్స్ మహమ్మారిపై యువత, విద్యార్థులు పోరాడాలని హోమియో వైద్యులు డాక్టర్ పవన్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో రెడ్డిపాలెంలోని శ్రీచైతన్య కాలేజిలో డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో డ్రగ్స్ వినియోగం పెరింగిందని, దీని వల్ల యువత భవిష్యత్ పాడవుతుం దన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న డాక్టర్ పవన్

డ్రగ్స్ వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో పాటు చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. సమాజం లో డ్రగ్స్ మాఫియా పెరుగు తుండటం ఆందోళనకరమని, ప్రభుత్వాలు డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు అందరూ డ్రగ్స్‌కు నో చెప్పాలని, ఆరోగ్యకరమైన జీవితానికి అవును చెప్పాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.పవన్‌కుమార్, షేక్.సమీర్ తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు దాసరి కిరణ్, బి.సౌమ్య, జిల్లా కమిటీ సభ్యులు యశ్వంత్, నాయకులు సుభాని, షాలి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో గుంటూరు మహిళకు పతకాలు



రెండు బంగారు, ఒక వెండి పతకాలతో ఘన విజయం సాధించిన నవమి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

బాపట్ల పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో గురువారం నిర్వహించిన స్టేట్ మాస్టర్ అథ్లెటిక్ స్పోర్ట్స్ ఈవెంట్‌లో గుంటూరు నగరానికి చెందిన యువ అథ్లెట్ లాం నవమి అద్భుత ప్రదర్శనతో పతకాల సాధించారు. ఈ పోటీల్లో ఆమె లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించడంతో పాటు మరో విభాగంలో రెండో స్థానం సాధించి ఒక వెండి పతకం కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఇంత గొప్ప విజయాన్ని సాధించిన సందర్భంగా గుంటూరు నగరంలోని ఆమె నివాసం వద్ద లాం వమిని కుటుంబ సభ్యులు, క్రీడాభిమానులు, స్థానికులు ఘనంగా సత్కరించారు. పూలమాలలు వేసి శాలువాలతో సన్మానిస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లాం నవమి మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించేందుకు నిరంతర సాధన, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో భారతదేశాన్ని ప్రతినిధ్యం వహిస్తూ అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. బంగారు పతకం సాధించడమే తన పరమ లక్ష్యమని ఆమె ధృడసంకల్పంతో వెల్లడించారు. నగరానికి చెందిన యువ క్రీడాకారిణి సాధించిన ఈ ఘన విజయం ఇతర క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

ఈ-ఫైల్స్ పరిష్కారంలో జిఎంసి కమిషనర్‌కు మొదటి స్థానం

ప్రజాశక్తి - గుంటూరు

రాష్ట్ర స్థాయిలో కార్పోరేషన్ల కేటగిరిలో అత్యధిక ఈఫైల్స్, తక్కువ సమయంలోనే పరిష్కరించి రాష్ట్రస్తాయి ర్యాంకులో మొదటి స్థానాన్ని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు దక్కించుకున్నారు. 11,348 ఈ-ఆఫీస్ ఫైల్స్ పరిష్కరించి మొదటి స్థానంలో నిలిచారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ రాష్ట్ర సచివాలయంలో ఈ-ఆఫీస్ ఫైల్స్ పరిష్కారంపై రాష్ట్ర స్థాయిలో కమిషనర్ల ర్యాంక్‌లు ప్రకటించారు. ఫైల్స్ నిర్వహణ, పరిష్కారంలో పారదర్శకతకు ఈ-ఆఫీస్ వినియోగంలో రాష్ట్ర స్థాయిలో కమిషనర్ 1 రోజు 6 గంటల వ్యవధిలోనే అధికంగా ఫైల్స్‌ని పరిష్కరించి మొదటి స్థానంలో ఉన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో మ్యానువల్ ఫైల్స్ నిర్వహణకు అధికారులు, సిబ్బంది అలవాటు పడి ఉన్నారని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అధికారులు, సిబ్బందికి అనేక సార్లు అవగాహన కల్పించి, పూర్తిస్థాయిలో అన్ని ఫైల్స్ ఈ-ఆఫీస్ ఫైలింగ్ విధానాన్ని నూరు శాతం అమలులోకి తెచ్చామన్నారు.దీని వల్ల పారదర్శకత ఉంటుందన్నారు. అలాగే జిఎంసిలో కొంత మంది అధికారులు, సచివాలయ కార్యదర్శుల వద్ద ఫైల్స్ కొంత జాప్యం జరుగుతుందని గుర్తించామని, రానున్న కాలంలో ప్రజలకు మెరుగైన సేవలు వేగంగా అందించేలా ఫైల్స్ పరిష్కార వేగవంతంపై చర్యలు తీసుకుంటామన్నారు.

బి.ఫార్మసీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో గత సెప్టెంబర్ లో జరిగిన బీఫార్మసీ 4వ, 6వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు సీఈ ఆలపాటి శివప్రసాద్ తెలిపారు. రీ వ్యాల్యూయేషన్ కోసం ఈ నెల 30వ తేదీ లోపు ఒక్కొక్క పేపరుకు రూ. 2070లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.



బైక్‌ను విడుదల చేస్తున్న షోరూం ప్రతినిధులు

మార్కెట్‌లోకి టివిఎస్ అపాచీ 160 4వి బైక్

ప్రజాశక్తి - గుంటూరు

టివిఎస్ మోటార్స్ కొత్త మోడల్ టివిఎస్ అపాచీ160 4వి టిఎఫ్‌టిని గుంటూరులోని పయినీర్ టివిఎస్ షోరూంలో గురువారం కష్టమర్ల చేతుమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూం ప్రతినిధి మహేష్ మాట్లాడుతూ ఈ వాహనాన్ని మన స్మార్ట్‌ఫోన్‌తో బ్లూటూత్ ద్వారా అనుసంధానం చేసుకోవచ్చన్నారు. వాయిస్ అసిస్టెంట్ కమాండ్‌ను, కాల్, మెస్సేజ్ అలర్ట్‌ను, ఇన్‌కమింగ్ కాల్స్, మెస్సేజ్‌ల నోటిఫికేషన్‌ను డిస్‌ప్లే కనిస్తాయన్నారు. రైడ్ మోడ్‌లు ఎంచుకునే అవకాశం ఉందని, టర్న్ బై టర్న్ నావిగేషన్ మ్యాప్‌ల ద్వారా దారి చూపిస్తుందన్నారు. గుంటూరు, తెనాలి వినియోగదారులకు దసరా, దీపావళి పండుగ సీజన్‌లో కొనుగోలు చేసిన వాహనదారులకు లక్కీడ్రా ద్వారా మొదటి బహుమతిగా గుంటూరులోని షేక్ జిలానీ, తెనాలిలో ఎం.నాగలక్ష్మికి రూ.250 గ్రాముల సిల్వర్ బహుమతి అందించారు. రెండో బహుమతిని గుంటూరులోని వి.శ్రీధర్‌బాబు, తెనాలిలోని డి.శ్రీనుకు మైసూర్, కూర్గ్ ట్రిప్ కూపన్లు అందజేశారు. కార్యక్రమంలో పయినీర్ టివిఎస్ అడ్మిన్ ఇన్‌చార్జి మహేష్‌చౌదరి, సిఇఒ రాఘవేంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి - గుంటూరు

నగరంలో ఉదయం 7 గంటలలోగా మెయిన్‌రోడ్ల స్వీపింగ్ పూర్తి కావాలని, ఆతర్వాత ఇంటింటి చెత్తసేకరణ జరగాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం సంగడిగుంట, కాకానిరోడ్, వాసవినగర్, సాయినగర్, బస్టాండ్, నందివెలుగురోడ్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉదయం 7 గంటల తర్వాత ట్రాఫిక్ పెరుగుతుందని, కనుక ఆసమయంలోపే మెయిన్ రోడ్లు శుభ్రం చేయాలన్నారు. సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డుపై బిర్యానీలు వండుతూ రోడ్లపై గోతులకు కారణం అవుతున్న వాటిని తొలగించాలని, పునరావఅతంచేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలన్నారు. అనంతరం ఒమేగా హాస్పిటల్ వెనుక రోడ్‌లో గ్రీవెన్స్‌లో అందిన ఫిర్యాదును పరిశీలించి, ఆయా నిర్మాణాలకు ఆస్తి పన్ను విధించాలని, ప్లాన్ లేకుంటే తగు చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. వాసవి నగర్, సాయి నగర్, నందివెలుగు రోడ్‌లో ప్రజల నుండి అందిన ఫిర్యాదులు పరిశీలించి ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, డ్రైన్లు కచ్చా రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో డిఈఈలు కళ్యాణరావు, హనీఫ్, వెంకటరమణ, ఆర్ఓ సాదిక్‌బాష, ఎస్ఎస్ సాంబయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్